గాడి తప్పిన పంచాయతీ పాలన

- చెత్తపై లేని చిత్తశుద్ధి
- వెలగని విద్యుత్ దీపాలు
- లోపించిన పారిశుధ్యం



రెడ్డి కాలనీలో వెలగని విద్యుత్ దీపాలు



ఇచ్చోడలో ప్రధాన రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

ఇచ్చోడ: మెజార్ పంచాయతీ ఇచ్చోడలో ప్రత్యేక పాలన గాడి తప్పింది. రోజుల తరబడి రోడ్లపై చెత్త ఉన్నా.. పంచాయతీ పాలకులు పట్టించుకోవడం లేదు. వర్షాకాలంలో పలు కాలనీలో పారిశుధ్యం లోపించడంతో దుర్గంధం వస్తుంది. దీంతో దోమలు వ్యాప్తి చెంది పలువురు కాలనీవాసులు జ్వరాల భారీన పడుతున్నారు. గతనెల రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పలు కాలనీలో అంతర్గత రోడ్లు బురదమయంగా మారినా.. అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. ప్రత్యేక పాలనలో పంచాయతీ వ్యవస్థ గాడి తప్పిపోయిందని ప్రజలు వాపోతున్నారు.

ఎక్కడికక్కడే చెత్త..

మెజార్ పంచాయతీ పరిధిలో ప్రధానరోడ్లు కూడళ్ల వద్ద రోడ్లపై చెత్త కుప్పలు కుప్పలుగా దర్శనమిస్తోంది. చెత్తపై అధికారులకు చిత్తశుద్ధి కనిపించడం లేదు. పంచాయతీలో 25 మంది వరకు పారిశుధ్య కార్మికులు ఉన్నప్పటికీ ప్రతీ రోజు చెత్తను తొలగించే విధంగా అధికారులకు ప్రణాళిక లేక పోవడంతో రోజుల తరబడి ఎక్కడి చెత్త అక్కడే ఉంటుంది. దీంతో పంచాయతీ పరిధిలో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

వెలగని విద్యుత్ దీపాలు..

గత కొన్ని రోజులుగా మండల కేంద్రంలో పలు కాలనీలో విద్యుత్ దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రివేళలో పలు కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ పరిధిలో 32 వినాయక మండపాలు ఉన్నాయి. వినాయక చవతి సందర్భంగా పంచాయతీ అధికారులు విద్యుత్ దీపాలను అమర్చాలి కానీ పంచాయతీ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో వినాయక మండపాల వద్ద సైతం చిమ్మ చీకట్లు కనిపిస్తున్నాయి.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి



డీఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీలు

ఆదిలాబాద్‌టౌన్/ఇంద్రవెల్లి/బోథ్/గుడిహత్నూర్/ఉట్నూర్‌రూరల్/బేల/ఇచ్చోడ/నార్నూర్: ఆదివాసీ మహిళపై అత్యాచారం, హత్యా యత్నానికి ప్రయత్నించిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని డీఎస్పీ కార్యాలయానికి ర్యాలీగా చేరుకొని డీఎస్పీ జీవన్‌రెడ్డికు వినతిపత్రం అందజేశారు. అలాగే ఆయా మండల కేంద్రాల్లో మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన కార్యక్రమాలు నిర్వహింస్తామన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఎస్సైలకు వినతిపత్రాలు అందజేశారు.

రేషన్ డీలర్లు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సుభాష్ చందర్

బోథ్: రేషన్ డీలర్లు లబ్ధిదారులకు అందుబాటులో ఉండి రేషన్ సరుకులను అందించాలని తహసీల్దార్ సుభాష్ చందర్ అన్నారు. గురువారం మండలంలోని రేషన్ డీలర్లతో తహసీల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. ఎన్‌ఫోర్‌మెన్స్ డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రామారావు, డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

నేరడిగొండ: మండలంలోని రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలని తహసీల్దార్ కలీమ్ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రతీ లబ్ధిదారుడికి చేర్చాలన్నారు. రేషన్ షాపులకు వస్తున్న సరుకులను లబ్ధిదారులకు అందించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ మహేశ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రామారావు, ఆర్ఐ నాగోరావు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

సైన్స్ పార్క్ పర్యవేక్షకుల నియామకం



సైన్స్‌పార్క్‌లో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

జిల్లా కేంద్రంలోని సైన్స్ పార్క్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో 'సాక్షి'లో 'విజ్ఞానం.. గడ్డిపాలు' అనే శీర్షికన గురువారం ప్రచురితమైన కథనానికి జిల్లా విద్య శాఖ అధికారి ప్రణీత స్పందించారు. సైన్స్ పార్క్ పర్యవేక్షణ, నిర్వహణ బాధ్యతలను జిల్లా సైన్స్ అధికారికి అప్పగించారు. వారం రోజుల పాటు ఆరుగురు నాల్గో తరగతి ఉద్యోగులు పరిశుభ్రత, నిర్వహణ కోసం విధులు నిర్వహించాలని డీఈవో ఆదేశించారు. పూర్తి స్థాయిలో పిచ్చిమొక్కలు తొలగించాలని మున్సిపల్ అధికారులకు తగు ప్రతిపాదనలు సమర్పించారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

క్లుప్తంగా

సీతారాం ఏచూరి మృతి తీరని లోటు



జెండా అవనతం చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పీడిత ప్రజల పోరాటానికి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులు పెచ్చరిల్లిపోయి ప్రజలు నలిగిపోతున్న తరుణంలో శ్రామిక శక్తులను ఏకం చేసి పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఆయన మృతిపట్ల సంతాపం ప్రకటించారు. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పనిచేశారని కొనియాడారు.

ఎదులాపురం: సీపీఐఎం ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం పార్టీకి తీరని లోటని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. సీతారాం ఏచూరి గురువారం అనారోగ్యంతో మరణించడంతో జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జెండాను అవనతం చేశారు. ప్రజా ఉద్యమంలో, పార్లమెంటరీ వ్యవస్థలో ఆయన ఎప్పుడు ప్రజల పక్షం వహించారని కొనియాడారు.

ఎమ్మెల్యే పరామర్శ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: మండలంలోని ఇస్పూర్ గ్రామానికి చెందిన గంగాసింగ్ మాత్యమూర్తి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం వారి నివాసినికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు జాదవ్ గణేష్, నానక్ సింగ్, దేవేందర్ రెడ్డి, సుజీల్, ప్రతాప్ సింగ్, వసంత్, సవాయి పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

ఆదిలాబాద్‌టౌన్: భీంపూర్ మండలంలోని ధనోర పాఠశాల విద్యార్థి ఇటీవల పాము కాటుకు గురయ్యాడు. ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ పట్టణానికి చెందిన మానిష్ రెడ్డి గురువారం ఆస్పత్రికి వెళ్లి బాలుడిని పరామర్శించారు. ఆర్థిక సాయం అందజేశాడు.

నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

బోథ్: మండలంలోని సూర్యనగర్ గ్రామస్తులు గురువారం బోథ్ ఎమెల్యే అనిల్ జాదవ్‌ను నేరడిగొండ మండల కేంద్రంలో కలిశారు. గ్రామంలో గతంలో సేవాలాల్ మందిరానికి ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసిందని, ఇంకా రూ.5 లక్షలు ఇప్పటికీ రాలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆగిన నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు గుండేరావు, రమేశ్, విఠల్, గోపిచంద్, పవార్ శ్యామ్ రావ్, జాదవ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్ రాధ

ఆదిలాబాద్‌టౌన్: చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రం టీచర్ రాధ అన్నారు. పోషణ మాసంలో భాగంగా గురువారం రేషన్‌షాప్‌లో లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రొటీన్లు, విటమిన్లు, ఆకుకూరలు, కూరగాయలతో భోజనం చేయాలని సూచించారు. పోషక విలువలు లేని ఆహారం తీసుకోవడంతో అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంటుందన్నారు.

15న కవితా పురస్కార సభ

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో ఈనెల 15న ఉదారి నాగదాసు కవితా పురస్కార సభను నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు ఉదారి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా తత్వాల సీడీని ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. కవులు, రచయితలు, సాహిత్య అభిమానులు సభను విజయవంతం చేయాలని కోరారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలి



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని రామకృష్ణ సేవా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆరె భూమన్న, లెనిన్‌లు అన్నారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన, విక్రయాలు జరిపారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వాటిని కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో విద్యార్థులు మొబైల్ ఫోన్‌లకు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. దీంతో పఠన ఆసక్తి తగ్గుతుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను పుస్తకాలు చదివించేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో కోటేశ్వర్‌రావు, హన్మాండ్లు, ఉదయ్, నారాయణ రెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యాబోధన చేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈవో సోమయ్య

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులకు చదువుతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని ఆదిలాబాద్‌అర్బన్ మండల విద్యాధికారి డి.సోమయ్య అన్నారు. గురువారం ఆదిలాబాద్‌అర్బన్ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థులకు వండిపెట్టే మధ్యాహ్న భోజనాన్ని సైతం పరిశీలించారు. ప్రతివారం విద్యార్థులకు న్యాస్ కోసం నమూన పరీక్ష నిర్వహించాలని సూచించారు. పరిసరాలతో పాటు విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వివరించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

నేరడిగొండ: ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని హెచ్ఈవో పవార్ రవీందర్ అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం మండలంలోని కుంటాల బాలికల ఏహెచ్ఎస్ ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వైద్య సిబ్బంది విద్యార్థినుల రక్త నమూనాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు సోకే అవకాశం ఉంటుందని, వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. 30 మంది విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నిఖత్, ఏఎన్ఎం జ్యోతి, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలో మాల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. బోథ్ మండల మాల సంఘం అధ్యక్షుడిగా ఎలుక రాజు, మండల నాయకులు ఉషన్న, సురేందర్, లక్ష్మణ్, స్వామి ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భూర్తుల స్వామి, ఉపాధ్యక్షుడిగా బొమ్మెత సంజయ్, ప్రధాన కార్యదర్శిగా పాముల సంతోష్, సెక్రెటరీగా మునేశ్వర్ సోమన్న, సంయుక్త కార్యదర్శి మొరుగు ప్రభాకర్, ప్రచార కార్యదర్శి సంగెం పూర్ణ చందర్, సభ్యులుగా మద్దెల మహేశ్, బత్తుల రమేశ్, భీంరావ్ పాటిల్, భగత్ రవి, బత్తుల రాజు, ఏరేకర్ రాహుల్, కోటాడి అరవింద్, బక్కు వార్ రమాకాంత్, పాటిల్ సందేష్ ఎన్నికైయ్యారు. అలాగే కూచులాపూర్ గ్రామంలో మాల సంక్షేమ సంఘాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సింగారి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా సాగర్, ప్రధాన కార్యదర్శిగా భూమేష్, ప్రచార కార్యదర్శిగా భూతి రాజు, కార్యదర్శిగా నరేశ్‌లను ఎన్నుకున్నారు.

టీపీయూఎస్ కార్యవర్గం..

ఇంద్రవెల్లి: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్)నూతన కార్యవర్గాన్ని గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలో ఏగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గేడం కేశవరావు, ఉపాధ్యక్షుడిగా రూపావత్ రాంకుమార్, ప్రధాన కార్యదర్శి జాదవ్ మేఘనాథ్, కార్యదర్శులుగా ఆడే కిరణ్, శ్యామల, విజయలక్ష్మి, కోశాధికారిగా రాథోడ్ శ్రీకాంత్, సహాయ అధ్యక్షుడిగా కొడిచర్ల శ్రీనివాస్‌లకు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సునీల్ చౌహన్, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ కార్యవర్గం

ఆదిలాబాద్‌రూరల్: పీఆర్టీయూ ఆదిలాబాద్ రూరల్ మండల శాఖ కార్యవర్గాన్ని గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని సంఘ భవనంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా దాసరి వెంకట రమణ, తూము అమరేందర్‌లతో పాటు అసోసియేట్ అధ్యక్షుడిగా జావిద్ అలీ, మహిళా అధ్యక్షుడిగా రమారాణి, కార్యదర్శిగా సంతోష్ కుమార్, మహిళా కార్యదర్శిగా ద్రౌపతి బాయిలను ఎన్నుకున్నారు.

పాఠశాలల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని మామిడిగూడ ఆశ్రమ పాఠశాల కాంప్లెక్స్ పరిధిలోని దహిగూడ, మొలాల్‌గుట్ట, సాలాయిగూడ, ఖండాల తండా, చిన్నలోకారి, జంబుల్‌ధరి, సల్పాల్‌గూడ, వాన్‌వాట్, లింగుగూడ, ధర్‌లొద్దీ టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలను హెచ్‌ఎం రొద్ద శైలజ తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. క్యాష్ బుక్, సీఎల్, మూవ్‌మెంట్, సీసీఈ, తదితర రిజిస్టార్‌లను పరిశీలించారు. ఎస్‌సీఈఆర్‌పీ మధుసూధన్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



ఉపన్యాస పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో కార్యక్రమాన్ని చేపట్టారు. కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం, కోటయ్య, కునాల్, చంద్రకాంత్, పృథ్వీ, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

తప్పులు సరిచూసుకోండి

నార్నూర్: అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఓటర్ జాబితాను ప్రదర్శించడం జరుగుతుందని ఎంపీవో స్వప్నశీల గురువారం తెలిపారు. గ్రామపంచాయతీ కార్యాలయాల్లో వార్డు వారీగా ప్రచురించిన ఓటరు జాబితాను పరిశీలించి తప్పుఒప్పులు ఉంటే సరిదిద్దుకునే అవకాశం ఉందన్నారు. ఎలాంటి అనుమానం ఉన్నా.. సంబంధిత పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బేల: మండలంలోని దహెగాం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం రావడంతో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఎస్సై రాధిక ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గురువారం పేకాట స్థావరంపై దాడి చేసి, ముగ్గురు వ్యక్తులు పట్టుబడగా, మరో నలుగురు పరారయ్యారు. ముగ్గురి నుంచి రూ.9160 నగదు స్వాధీనం చేసుకొని, ఏడుగురిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పారిశుధ్యంపై దృష్టిసారించాలి



ట్యాంకును పరిశీలిస్తున్న ఎంపీవో

నార్నూర్: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సాధించాలని ఎంపీవో స్వప్నశీల అన్నారు. గురువారం మండలంలోని ఎంపల్లి గ్రామాన్ని ఆమె సందర్శించారు. తాగునీటి ట్యాంక్‌ను పరిశీలించారు. శానిటేషన్, క్లోరినేషన్ జరుగుతున్న తీరును గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా తాగునీటి ట్యాంక్‌తో పాటు బావుల్లో బ్లీచింగ్ ఫౌడర్ వేయాలన్నారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి దినేష్, గ్రామస్తులు ఉన్నారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు చేశాం



గోదావరి వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న చైర్మన్, అధికారులు

ఖానాపూర్: పట్టణంలోని గోదావరి తీరంలో ఆదివారం, మంగళవారం నిర్వహించే వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. గురువారం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు గోదావరి తీరంలో నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాజ్, ఖానాపూర్ సీఐ సైదారావు, ఎస్సై లింబాద్రి, మున్సిపల్ కమిషనర్ మనోహర్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు మంత్రరాజం సురేశ్, నాయకులు తొంటి శ్రీనివాస్, దయానంద్, లక్ష్మీపతి తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ఘనంగా గణేశ్ ఉత్సవాలు

ఇంద్రవెల్లి: మండలంలోని మథుర తండాలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మథుర సమాజ్ యువకులు ఒక గ్రామం నుంచి ఇంకో గ్రామానికి అతిథులుగా వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం ఆరో రోజు మండలంలోని జాలంతండా గ్రామానికి నిర్మల్ జిల్లాలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన మథుర సమాజ్ యువకులు ప్రత్యేక పూజలు చేశారు.

గౌరీ మహాలక్ష్మి పూజలు

బోథ్: మండలంలోని కోట(కె) గ్రామంలో గౌరీ మహాలక్ష్మి పూజలు నిర్వహించారు. గణపతి చవితి తరువాత మూడు రోజుల నుంచి మహాలక్ష్మి పూజలు ప్రారంభమవుతాయి. గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సంగ్రామ్, పవన్, సిర్పూర్ మహేశ్, భూర్తుల స్వామి, కేంద్రే మాధవ్, మానాల శేఖర్ పాల్గొన్నారు.

అధ్యాపకుడికి సన్మానం

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కెమిస్ట్రీ అధ్యాపకులు సాయిప్రసాద్‌కు ఉస్మానియా యూనివర్సిటీ కెమిస్ట్రీలో డాక్టరేట్ అవార్డు ఇటీవల ప్రదానం చేసింది. కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్, అధ్యాపకులు నర్సింగ్‌రావు, పీడీ అనిత, ముజీబ్, రవీందర్, రాజశేఖర్, సిబ్బంది అభినందించారు.

రోడ్డు పరిశీలన

బేల: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వచ్చిన వరదలతో బేల మండలంలోని ఖడ్కి గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గం సగం వరకు కోతకు గురైంది. దీంతో గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి కోతకు గురైన రోడ్డును గురువారం పరిశీలించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

మార్కెటింగ్ అధికారికి సన్మానం

బోథ్: జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్‌ను బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి గురువారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ సిబ్బంది, డైరెక్టర్ అబ్రార్‌పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యుడిని కలిసిన నాయకులు

బోథ్: రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్‌ను మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు గొర్ల రాజు యాదవ్, అనిల్ అప్పు, అబూద్‌లు హైదరాబాద్ కలిసి, శాలువాతో సత్కరించారు.

పార్కింగ్ పరేషాన్



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పార్కింగ్ సమస్య రోజు రోజుకు జటిలమవుతుంది. ప్రత్యేక పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో దుకాణాల ఎదుటే వాహనాలను నిలుపుతున్నారు. నేతాజీచౌక్ నుంచి వివేకానంద చౌక్‌కు వచ్చే మార్గంలో ఆసుపత్రులు ఉండటంతో బైక్‌లు, ఆటోలను ఇష్టారాజ్యంగా రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

- సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్